జల్లేరులో యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు



జల్లేరు వాగు వంతెన ప్రాంతంలో ఇసుకను ఎడ్ల బళ్లపై తరలిస్తున్న దృశ్యం



ఇసుక తవ్వకాలతో జల్లేరు వాగులో ఏర్పడిన గోతులు

- ఎడ్లబళ్లపై ఇష్టానుసారంగా తరలింపు
- రూ.600 నుంచి రూ.800 వరకు విక్రయం

జంగారెడ్డిగూడెం రూరల్: అక్రమ ఇసుక తవ్వకాలతో జల్లేరు వాగు ప్రమాదకరంగా మారుతోంది. గత కొన్ని రోజులుగా కొందరు దళారులు జల్లేరు వంతెన ప్రాంతంలో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేస్తూ విక్రయాలు చేస్తున్నారు. ట్రాక్టర్లపై ఇసుక తరలిస్తే అధికారులు చర్యలు చేపట్టడంతో ఎడ్ల బళ్లపై ఇసుకను తరలిస్తే పట్టుకోరనే ధీమాతో కొత్త పంథాలో ఇసుక తరలించేస్తున్నారు. భవన నిర్మాణాలు చేస్తున్న వారికి విక్రయాలు చేస్తూ దళారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఒకో ఎడ్ల బండి ఇసుక రూ.600 నుంచి రూ.800 వరకు విక్రయాలు చేస్తున్నారు. నిత్యం పట్టపగలే అధిక సంఖ్యలో ఎడ్ల బండ్లతో ఇసుకను తరలించడంతో జల్లేరు వంతెన ప్రాంత పరిసరాలు గోతులుగా మారుతున్నాయని, దీని వల్ల వంతెన పటిష్టత దెబ్బతినే ప్రమాదం ఉందనే ఆందోళన వ్యక్తమవుతోంది. దీని వల్ల భూగర్భ జలాలు కూడా అడుగంటే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇసుక తవ్వకాలతో జల్లేరు వాగు పరిసరాలు గుల్ల చేయడంతో ప్రమాదాలు పొంచి ఉన్నాయని భయపడుతున్నారు. ఇటీవల వంతెన ప్రాంతంలో కాలువలోకి దిగిన జీలుగుమిల్లి మండలానికి చెందిన ముగ్గురు ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. అధికారులు స్పందించి అక్రమ తవ్వకాలపై చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా కార్డెన్ సెర్చ్



కమ్మరగూడెంలో కార్డన్ సెర్చ్ నిర్వహించిన పోలీసులు



స్వాధీనం చేసుకున్న మోటార్ సైకిళ్లతో పోలీసులు



పంగిడిగూడెంలో వాహనాలను సీజ్ చేసిన సీఐ రాజేష్

పోలవరం రూరల్: పోలవరం పంచాయతీ పరిధిలోని కమ్మరిగూడెంలో పోలవరం సీఐ జి.మధుబాబు, ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం సాయంత్రం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జూన్ 4వ తేదీన జరిగే కౌంటింగ్ ప్రక్రియ సజావుగా జరిగేందుకు గాను ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ప్రజలతో కలిసి చర్చించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అనుమానం ఉన్న ప్రాంతాల్లో రహదారి పైన వాహనాలను కూడా సోదాలు చేశారు. పోలవరంలో గట్టి నిఘా ఏర్పాటు చేశారు.

జంగారెడ్డిగూడెం వైఎస్సార్ కాలనీలో..

జంగారెడ్డిగూడెం: పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం వైఎస్సార్ కాలనీలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ జంగారెడ్డిగూడెం ఎస్సైలు జ్యోతి బాసు, లక్కవరం సుధీర్ బాబు జంగారెడ్డిగూడెం ట్రాఫిక్ ఎస్సై, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో సోదాలు చేశారు. దీనిలో ఎటువంటి పత్రాలు, ఆధారాలు లేని 20 మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నామని పోలీసులు తెలిపారు. అనుమానాస్పదంగా ఉన్న వ్యక్తుల కదలికల గురించి, ఏ విధమైన రికార్డు లేని వాహనాలను స్వాధీనం చేసుకుని ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలన చేశారు. సార్వత్రిక ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా కార్డెన్ సెర్చ్ నిర్వహించి, గ్రామస్తులకు అవగాహన కల్పించారు.

పంగిడిగూడెంలో 14 వాహనాల సీజ్

జంగారెడ్డిగూడెం రూరల్: జంగారెడ్డిగూడెం మండలం పంగిడిగూడెం గ్రామంలో పోలీసులు ఆదివారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. జంగారెడ్డిగూడెం సీఐ రాజేష్ తన సిబ్బందితో కలిసి గ్రామంలో పలు చోట్ల తనిఖీలు చేపట్టారు. ఎటువంటి రికార్డులు లేని 14 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకుని సీజ్ చేసినట్లు సీఐ రాజేష్ తెలిపారు. గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎప్పటికప్పుడు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. జంగారెడ్డిగూడెం ఎస్సై జ్యోతిబాస్, లక్కవరం ఎస్సై సుధీర్ పాల్గొన్నారు.

కోడిపందేలపై దాడి

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని ఇంద్రజిత్ నగర్‌లో ఆదివారం నిర్వహిస్తున్న కోడి పందేలపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై జి.జ్యోతి బాస్ చెప్పారు. వీరి నుంచి రెండు కోడి పుంజులు, రూ.600 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయం కోరుతూ..



పొంగుటూరు నుంచి గౌరీపట్నం పుణ్యక్షేత్రానికి పాదయాత్రగా వెళుతున్న వైఎస్సార్ సీపీ శ్రేణులు

కొయ్యలగూడెం: రాష్ట్రంలో జగనన్న నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడాలని, ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరు సునీల్, పోలవరం ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి విజయం సాధించాలని కోరుతూ పొంగుటూరు నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆదివారం పాదయాత్ర నిర్వహించారు. నిర్మలగిరి మేరీ మాత పుణ్యక్షేత్రానికి సర్పంచ్ పసుపులేటి రాంబాబు, వార్డ్ మెంబర్ దిర్సి పామ్ మధు ఆధ్వర్యంలో యాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా పాదయాత్ర చేస్తున్న పార్టీ శ్రేణులకు మహిళలు హారతులు పట్టి వీడ్కోలుతో సాగనంపారు. కే విజయబాబు, బల్లిరాజు, చాపల శ్రీను, పి.నవీన్, కె.భాను, కె.ప్రకాష్ కె.నరేంద్ర, డి.వీర్రాజు ఎస్.రవి, జె.సుబ్రహ్మణ్యం, సీహెచ్ జగదీశ్, టి.వెంకటేష్, ఎస్.ఆనంద్ బృందంలో ఉన్నారు.

తంగెళ్లగూడెంలో మాసికా మహోత్సవ్



తంగెళ్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న సీడీపీఓ స్వర్ణకుమారి

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు పంచాయతీ గిరిజన గ్రామం తంగెళ్లగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో ఆదివారం మాసికా మహోత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐసీడీఎస్ సీడీపీఓ యూఎన్ స్వర్ణకుమారి హాజరయ్యారు. ఈ సందర్భంగా కిశోర బాలికలకు రుతుక్రమంలో వచ్చే మార్పులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అదేవిధంగా పౌష్టికాహారం తీసుకోవాల్సిన ఆవశ్యకతపై బాలికలకు వివరించారు. సూపర్‌వైజర్లు నయోమీరాణి, ఎం.వెంకాయమ్మ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్త్ సిబ్బంది ఆశా వలంటీర్లు, డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

వైభవంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం





ఆలయంలో నిర్వహించిన కోలాట నృత్య ప్రదర్శనలు, విశేష అలంకరణలో షిరిడీ సాయిబాబా

భీమడోలు: భీమడోలులో ప్రసిద్ధిగాంచిన సద్గురు షిర్డిసాయిబాబా ఆలయంలో ఆదివారం 27వ వార్షికోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు సాయిబాబాను విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. భక్తుల సాయి నామ సంకీర్తనలతో ఆలయ ప్రాంతమంతా మార్మోగింది. తిరుమల తిరుపతి దేవస్థానం దాస సాహిత్య భజన మండలి వారితో కోలాటం నృత్య ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక నాటిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చి బాబాను దర్శించుకున్నారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమంలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు డి.సూర్యనారాయణరాజు, ఎం.లక్ష్మణరావు, జి.భాస్కరరావు, పుప్పాల వెంకటేశ్వరరావు, వై.వీరరాఘవులు, తుమ్మల ఉమామహేశ్వరరావు, ఎం.సత్యనారాయణ, గంధం వెంకట్రావు, ఈడే సత్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు అందుబాటులో వసతి గృహాలు

దెందులూరు: దివ్యాంగులైన శారీరక వైకల్యం, దృష్టి లోపం, మూగ, చెవుడు, బధిరులు మూడో తరగతి నుంచి పీజీ స్థాయి వరకు చదువుతున్న వారికి ఏలూరు కోటదిబ్బ ప్రాంతంలో వసతిగృహాలు అందుబాటులో ఉన్నాయని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారిణి, డిప్యూటీ కలెక్టర్ పి.రాకడమణి ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన వారు ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంటర్మీడియట్‌లో చేరేవారు, ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీకి చేరేవారు, డిగ్రీ పాసై పోస్టు గ్రాడ్యుయేట్ చేరేవారు విభిన్న ప్రతిభావంతులు వసతి పొంది విద్యనభ్యసించవచ్చన్నారు. ఒక్కసారి 3వ తరగతిలో ప్రవేశం పొందిన వారు వారి వసతికి ఇతర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా పోస్టు గ్రాడ్యుయేట్ వరకు వసతి పొందవచ్చునన్నారు. ఈ వసతి గృహంలో ప్రవేశం పొందిన వారికి ఉచిత భోజన వసతితో పాటు నాలుగు జతల దుస్తులు, దుప్పట్లు, ట్రంకు పెట్టె, నోటు పుస్తకాలు, ప్రతి రోజూ కోడిగుడ్డు, వారంలో రెండు, మూడు రోజులు చికెన్‌తో భోజనం అందిస్తామన్నారు. కాస్మొటిక్స్ ఛార్జీలు కింద 3వ తరగతి నుంచి 6వ తరగతి వరకు విద్యనభ్యసించే బాలురకు నెలకు రూ.175, బాలికలకు రూ.130 చెల్లిస్తామన్నారు. 7వ తరగతి నుంచి ఉన్నత విద్యనభ్యసించే యువకులకు నెలకు రూ. 200, యువతులకు రూ.200 చెల్లిస్తున్నామన్నారు. విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేకంగా సాఫ్ట్ నర్సులు కూడా ఉన్నారన్నారు. జిల్లాలో దివ్యాంగులైన విద్యార్థులు రాష్ట్ర ప్రభుత్వం కల్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాకడమణి కోరారు. మరిన్ని వివరాలకు 8142938379, 9394004882 నంబర్లకు వివరాలు అడిగి తెలుసుకోవచ్చన్నారు. తల్లిదండ్రులు నేరుగా వచ్చి వసతి గృహాలను సందర్శించవచ్చునన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



భీమడోలు ఉన్నత పాఠశాలలో కలిసిన బాల్యమిత్రులు

భీమడోలు: భీమడోలు జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదివిన 1986–90 బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఆద్యంతం ఆహ్లాదకర వాతావరణంలో కొనసాగింది. పూర్వ విద్యార్థుల నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇదే పాఠశాలలో ఐదేళ్ల పాటు చదువుకున్న వారంతా పదో తరగతిని పూర్తి చేసుకుని 34 ఏళ్లు అయ్యింది. దీనితో ఎప్పుడా అని ఎదురు చేస్తున్న బాల్యమిత్రులంతా ఒక చోటుకు చేరుకుని తమ మధుర జ్ఞాపకాలను నెమరవేసుకున్నారు. బాల్యమిత్రులను కలవడంతో వారి ఆనందానికి అవధుల్లేవు. తాము చదువుకున్న తరగతి గదులను, పరిసరాల్లో కలియతిరిగి తమ మధుర స్మృతులను జ్ఞప్తికి తెచ్చుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో తమకున్న అనుబంధాన్ని నెమరువేసుకున్నారు. వారంతా ఐదు పదుల వయస్సులోనూ చిన్న పిల్లలుగా మారి ఆ పరిసరాల్లో కలియతిరుగుతూ, మారిన తరగతి రూపురేఖలను చూసి పరవశించిపోయారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండను సైతం లెక్క చేయకుండా తమ బాల్యస్నేహితులతో ఆ కుటుంబ నేపథ్యాన్ని పంచుకున్నారు. అనంతరం వారంతా గ్రూపు ఫొటోలు దిగారు. నిర్వహణ కమిటీ సభ్యుడు గెడా కృష్ణ ప్రసాద్, గంధం సురేష్, రంకిరెడ్డి శేఖర్, కరణం మోహనశ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు రాట్నాలమ్మ హుండీ లెక్కింపు

పెదవేగి: రాట్నాలమ్మ దేవస్థానంలో హుండీ లెక్కింపు కార్యక్రమం సోమవారం నిర్వహించనున్నట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎస్.సతీష్‌కుమార్ అన్నారు. పెదవేగి మండలం రాట్నాలకుంటలో ఈ నెల 27న సోమవారం ఉదయం 8 గంటలకు అమ్మవారి ఆలయ ముఖ మండపం వద్ద దేవదాయ ధర్మాదాయ శాఖ అధికారుల సమక్షంలో హుండీ లెక్కించనున్నట్టు కార్యనిర్వహణాధికారి చెప్పారు.

క్లుప్తంగా

విజిట్ రిజిస్టర్ల నిర్వహణపై జేసీ సంతృప్తి



దెందులూరు ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద రిజిస్టర్‌లో సంతకం చేస్తున్న జేసీ

దెందులూరు: దెందులూరు నియోజకవర్గ ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్ వద్ద విజిటర్ల రిజిష్టర్ నిర్వహణపై జిల్లా జాయింట్ కలెక్టర్, దెందులూరు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ బి.లావణ్యవేణి సంతృప్తి వ్యక్తం చేశారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద విజిటర్ల రిజిష్టర్ అత్యంత కీలకమన్నారు. స్ట్రాంగ్‌రూమ్‌కి మూడంచెల భద్రత, సీసీ కెమెరాలు, తాళాలకు సీళ్లతో పాటు అతి ముఖ్యమైనది విజిటర్ల రిజిష్టరేనన్నారు. స్ట్రాంగ్ రూమ్ వద్ద విధులు నిర్వహించే ఉద్యోగులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటిస్తూ అంకితభావంతో విధులు నిర్వహించాలన్నారు.

నేటి నుంచి సువార్త స్వస్థత సభలు

పెదవేగి : నేటి నుంచి దుగ్గిరాల్లో నాలుగు రోజులు పాటు సువార్త స్వస్థత సభలు నిర్వహిస్తున్నట్లు హోసన్నా మినిస్ట్రీస్ పాస్టర్ ఈడి కృపదానం తెలిపారు. ఆదివారం ఆయన దుగ్గిరాల్లో మాట్లాడుతూ పెదవేగి మండలం దుగ్గిరాలలోని పర్వతనేని బాబ్జి స్థలంలో ఈనెల 27 నుంచి 30వ తేదీ వరకు ప్రతిరోజు సాయంత్రం 6:30 గంటలకు సువార్త స్వస్థత సభలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ ప్రత్యేక సువార్త సభలకు వాక్యోపదేశకులుగా పాస్టర్ ఎస్ రాజశేఖర్, పాస్టర్ జెర్మియా, పాస్టర్ ఫ్రెడిపాల్, పాస్టర్ క్రాంతి పాల్ పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా అన్ని ప్రాంతాల నుంచి ప్రజలు ఈ ప్రార్థనల్లో పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లయన్స్ సేవలను విస్తరించాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): లయన్స్ సేవలను ప్రతి పల్లెటూరికి, ప్రతి సామాన్యుడికి చేరేలా విస్తరింపజేయాలని అందుకు కావలసిన ఏర్పాట్లకు లయన్స్ సేవా కో–ఆర్డినేటర్లు సహకరించి సేవలందించాలని ఎమ్మెల్సీ, లయన్స్ మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ వంకా రవీంద్రనాథ్ పిలుపునిచ్చారు. 2024–25 సంవత్సరపు లయన్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శి, కోశాధికారి, క్లబ్ ఆఫీసర్ల శిక్షణ శిబిరం ఏలూరు గ్రీన్‌సిటీలోని లయన్స్ భవనంలో జిల్లా 316 జి గ్లోబల్ లీడర్‌షిప్ ట్రైనింగ్ అధి నాయకుడు నందుల సీతారామారావు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఈ శిబిరంలో విశిష్ట అతిథిగా పాల్గొన్న రవీంద్రనాథ్ మాట్లాడుతూ లయన్స్ సేవలను గ్రామ స్థాయిలోకి విస్తరించడంతో పాటు క్లబ్‌లను ఏర్పాటు చేసే దిశగా ముందడుగు వేయాలన్నారు. ముందుగా లయన్స్ సంస్థ పితామహుడు మెల్విన్ జోన్స్ చిత్రపటానికి పూలమాలవేసి జిల్లా గవర్నర్ గట్టిం మాణిక్యాలరావు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ యార్లగడ్డ జగన్మోహన్‌రావు మాట్లాడుతూ వచ్చే సంవత్సరం లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు జులై నుంచి కాబోయే క్లబ్ నాయకులైన క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు, కోశాధికారి, అడ్మినిస్ట్రేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయటం సంతోషించదగ్గ విషయమన్నారు. 2024–25 జిల్లా గవర్నర్‌గా పదవీ బాధ్యతలు చేపట్టే కాకరాల వేణుబాబు మాట్లాడుతూ లయన్స్ కంటి ఆసుపత్రులు, డయాలసిస్ సెంటర్లు, శాశ్వత ప్రాజెక్టులుగా పిలవబడే వివిధ రకాల సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ జిల్లా ప్రథమ వైస్ గవర్నర్ పాపారావు నాయుడు, ఫ్యాకల్టీ, పూర్వపు జిల్లా గవర్నర్లు డాక్టర్ పి.విజయభాస్కరరెడ్డి, వి.మురళీమోహనరావు, జిల్లా నాయకులు ఎం.శ్రీహరి, వీ.రామారావు, వీ.సత్యస్వరూప్, ఎల్. వెంకటేశ్వరరావు, వీవీ స్వామి, పూర్వపు జిల్లా గవర్నర్ డాక్టర్ వీకే పంకజాక్షన్ వ్యవహరించగా రీజియన్ చైర్‌పర్సన్ ఎం.కృష్ణమోహన్, వి.రత్నకుమార్ పాల్గొన్నారు.

సుందరయ్య సస్పెన్షన్ రద్దు చేయాలి

ఏలూరు (టూటౌన్): ఎస్‌డబ్ల్యూఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ సుందరయ్య అక్రమ సస్పెన్షన్ రద్దు చేయాలని రౌండ్ టేబుల్ సమావేశం కోరింది. కార్మిక ఉద్యోగ ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో సీఐటీయూ ఏలూరు జిల్లా కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. ఏపీఎన్‌జీఓస్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్ ముఖ్య వక్తగా మాట్లాడుతూ మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ పరిధిలో లేని అంశాన్ని ఆధారంగా చేసుకుని ఆర్టీసీ నాయకులు సుందరయ్యను సస్పెండ్ చేయడం అప్రజాస్వామికమని, చిన్న చిన్న కారణాలతో ఉగ్యోగులను యథేచ్ఛగా సస్పెన్షన్లు చేయడం తగదన్నారు. ఏఐటీయూసీ జిల్లా నాయకులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలపై మాట్లాడటం మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కు విరుద్ధం కాదని, ఇది ఉద్యోగుల హక్కులపై దాడి తప్ప మరొకటి కాదన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు బద్దా వెంకట్రావు, సీఐటీయూ ఏలూరు నగర అధ్యక్షుడు బి.జగన్నాథరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముగిసిన వెంకన్న కల్యాణోత్సవాలు



గుండుగొలనులో స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న భక్తులు

భీమడోలు: గుండుగొలనులో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాల ముగింపును పురస్కరించుకుని ఆదివారం ఆలయం వద్ద అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈనెల 19 నుంచి 24 వ తేదీ వరకు ఆలయంలో కల్యాణోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అన్న ప్రసాద వితరణ చారిటబుల్ ట్రస్ట్, దేవదాయ ధర్మాదాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పరిసర గ్రామాలకు చెందిన భక్తులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ చైర్మన్ వగ్వాల మీనాకుమారి అచ్యుత రామారావు, ఏఎంసీ మాజీ చైర్మన్ వగ్వాల భాస్కర్, మాజీ ఉపసర్పంచ్ మామిళ్లపల్లి కాశీబాబు, ఈవో కె.వంశీ, పూజారి మంగపతి ఆచార్యులు, భక్తులు పాల్గొన్నారు.

సైనికుల త్యాగాలకు ప్రజల మద్దతు కోరుతూ పాదయాత్ర



కైకరం చేరుకున్న స్వామీజీకి స్వాగతం పలుకుతున్న స్థానికులు

ఉంగుటూరు: దేశ సరిహద్దుల్లో సైనికులు చేస్తున్న త్యాగాలకు గుర్తుగా వారికి దేశవ్యాప్తంగా మద్దతు పలకాలని కోరుతూ కాశీ నుంచి కన్యాకుమారికి పాదయాత్ర చేపట్టినట్లు శివకరణ్ సింగ్‌స్వామీజీ తెలిపారు. శనివారం రాత్రి కైకరం చేరిన ఆయనకు స్థానికులు బస ఏర్పాటు చేశారు. ఉంగుటూరు, నారాయణపురం, చేబ్రోలు, మీదుగా పాదయాత్ర కైకరం చేరుకుంది. కైకరం విజ్ఞాన భారతి పాఠశాల ప్రిన్సిపాల్ విద్యాసాగర్ వారికి ఆశ్రయం కల్పించారు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన శివకరణ్ సింగు స్వామీజీ 2022 మార్చి 25న ఉత్తరప్రదేశ్ నుంచి పాదయాత్రగా బయలు దేరి 2022 నవంబర్ 30న కాశ్మీరు చేరుకున్నారు. అక్కడి నుంచి కన్యాకుమారికి బయలు దేరారు. సరిహద్దులో పనిచేసే సైనికులకు మద్దతు కావాలని కోరుతూ ప్రార్థిస్తున్నట్లు స్వామీజీ తెలిపారు. స్వామీజీతో పాటుగా పాదయాత్రలో మండలంలోని బీజేపీ కార్యకర్తలు విద్యాసాగర్, మెట్ట సత్యనారాయణ, నూకల రోహిత్ నాయుడు పాల్గొన్నారు.